సమస్యలుంటే డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురండి : జడ్జి

ప్రజాశక్తి - కడప

ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురావచ్చునని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత అన్నారు. గురువారం పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాథలు అభాగ్యులు, బిక్షాటన చేసే మహిళలు, పురుషులు, వివిధ ప్రాంతాల నుండి ఆసుపత్రి నిమిత్తం వైద్యం కోసం పట్టణానికి వచ్చే నిరుపేదలు, ఒంటరి, అనాథ మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల కోసం, వసతి లేక బహిరంగ ప్రదేశాలలో నివసించేవారు, వివిధ ప్రాంతాల నుండి పనులు చేసుకోవడానికి వచ్చిన వలస కూలీలు, విద్యార్థులు హాస్టల్ ఫీజు రూమ్ రెంట్ మెసేజ్లు చెల్లించలేక ఇబ్బంది పడే వారి కోసం ప్రభుత్వం ఉచిత నిరాశ్రయుల వసతి గృహాలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్ టోల్ ఫ్రీ నెంబర్ 14567 పైన అవగాహన కలిగించారు.

రేపటితో ప్రచారానికి తెర

- ఎత్తుగడల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి శనివారం తెరపడనుంది. గత నెల తొమ్మిది నుంచి ఆద్యంతం పోటాపోటీగా నడిచింది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ స్థానానికి పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల తరుపున ఎమ్మెల్సీ ఎన్నికలకు నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేసింది. ఎన్నికల షెడ్యూల్ అమలుపరిచింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి.రామ సుబ్బారెడ్డి ఏకగ్రీవం కావడం దగ్గర నెలకొన్న హైడ్రామా మొదలుకుని శనివారం సాయంత్రానికి ముగియనున్న ఎన్నికల వ్యవహారం ఉత్కంఠను కలిగించింది. ఎన్నికల ప్రచారం ముగియనున్న నేపథ్యంలో ఏజెంట్ల నియామకం, ఓటింగ్ పోలరైజేషన్ వంటి వ్యూహాల్లో ఎవరు పైచేయి సాధిస్తారో వేచి చూడాల్సి ఉంది. జిల్లాలో పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యవహారం క్లైమాక్స్ చేరుకుంది. గత తొమ్మిదిన ఎన్నికల నగారా మోగిన దగ్గర నుంచి నేటి వరకు ఎన్నికల ప్రచారం ఎన్నో మలుపులు తీసుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 39 మంది పట్టభద్ర, 12 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు బరిలో దిగిన సంగతి తెలిసిందే. ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలోని 27,716 మంది ఉపాధ్యాయ, 3,51,700 మంది పట్టభద్ర ఓటర్ల దృష్టిని ఆకట్టుకోవడానికి ఎమ్మెల్సీ బరిలో దిగిన ఆశావహులు వ్యూహాత్మకంగా ఎన్నికల ప్రచారం సాగించారు. అధికార వైసిపి మద్దతుదారులు ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలతో ఆత్మీయ సమ్మేళనాలు, ప్రతిపక్ష పార్టీల మద్దతుదారుల మద్దతుగా పరిశీలకుల నియామకం, వరుస సమీక్షా సమావేశాల నిర్వహణ, పిడిఎఫ్ అభ్యర్థులు ఉపాధ్యాయ, ప్రజాసంఘాల మద్దతుతో హోరాహోరీగా ఎన్నికల ప్రచారాన్ని సాగించాయి.

మన అరటి.. ఎంతో మేటీ!

- విదేశాలకు కడప అరటి ఎగుమతులు
- టన్ను ధర రూ.25 వేలు

ప్రజాశక్తి - చాపాడు

మన ప్రాంత అరటి అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సత్తా చాటుతోంది. ఎగుమతులను పెంచుకుంటూ రైతులకు భరోసా కల్పిస్తోంది. ఎగుమతులను మరింతగా ప్రోత్సహించాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ కొనుగోలుదారులు, అమ్మకందారులతో ఇప్పటికే ఒక వేదికను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 35 వేల టన్నుల అరటి పండ్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిర్ణయంతో రానున్న రోజుల్లో అరటి సాగుదారులకు మరింత ప్రయోజనం కలగనుంది. రాష్ట్రంలో 63.84 లక్షల టన్నుల అరటి పండ్లు ఉత్పత్తి అవుతుండగా.. ఇందులో ఒక్క వైఎస్సార్ కడప జిల్లా నుంచే 23,15,300 టన్నుల దిగుబడి వస్తోంది. ఒక్క పులివెందులలోనే 1,100 హెక్టార్లలో అరటి సాగవుతుండగా ఇక్కడి పంటకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు కూడా లభిస్తున్నది. సాధారణంగా అరటి పండ్లు 6, 7 రోజులు మాత్రమే నిల్వ ఉంటాయి. మన జిల్లాలో సాగు అయ్యే పండ్లు 14 రోజుల వరకు నిల్వ ఉంటున్నాయని రైతులు, వ్యాపారులు పేర్కొంటున్నారు. టిష్యూకల్చర్ వచ్చాక పండ్లలో నాణ్యత పెరిగిందని సూచిస్తున్నారు. కడప జిల్లాలో సాగైయ్యే అరటిలో 80 శాతం చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో 1,12,995 హెక్టార్లలో అరటి సాగవుతోంది. ఏటా 63,84,730 టన్నుల అరటి పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అరటి సాగవుతుండగా విస్తీర్ణం, ఉత్పత్తిలో కడప ప్రథమ స్థానంలో ఉంది. కడప జిల్లాలో పులివెందుల, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గంలో అధికంగా అరటి సాగు అవుతున్నది. మధ్య ప్రాచ్య దేశాలైన యూఏఈ, బెహ్రయిన్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్, ఇరాన్ దేశాల్లో మన అరటికి మంచి డిమాండ్ ఉంది. గ్రీన్ కావెండిష్ ప్రీమియమ్ రకాలు ఆ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2016-17లో 246 టన్నుల అరటి పండ్లు ఎగుమతి కాగా, 2017-18లో 4,300 టన్నులు, 2018-19లో 18,500 మెట్రిక్ టన్నులకు ఎగుమతులు పెరిగాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 35 వేల మెట్రిక్ టన్నుల అరటి పండ్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు మార్కెట్‌ను విస్తరించేందుకు వీలుగా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ ఏడాది కడప జిల్లా పులివెందులలో అరటి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేశారు. దీని కోసం ప్రభుత్వం 70 ఎకరాల భూమిని, పరిశోధనల కోసం 628 ఎకరాల భూమిని కేటాయించింది.

అరటి తోట

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు అరటి కాయలను లారీకి లోడ్ చేస్తున్న కూలీలు

ఇతర రాష్ట్రాలకూ ఆంధ్రా అరటి....

కోస్తా, రాయలసీమలో పండించే అరటి ఇతర రాష్ట్రాలకు సైతం వెళ్తుంది. ఢిల్లీ, రాజస్థాన్, ఒడిశా, బెంగాల్, బిహార్ రాష్ట్రాలకు ఆంధ్రాలో పండించే అరటిని తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తామని అరటి హోల్ సేల్ వ్యాపారులు సూచిస్తున్నారు. కడప జిల్లాలో సాగయ్యే అరటి మంచి నాణ్యతతో ఉండటంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో దీనికి బాగా డిమాండ్ ఉంది. మార్కెట్ సీజన్ల వారీగా ఉంటుంది. జులై నుంచి నవంబర్ వరకూ రేటు బాగా పలుకుతుంది. వేసవిలో మార్కెట్ సాధారణంగా ఉంటుంది. విదేశాలకు ఎగుమతిని చేసే అరటికి సాగు దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు తగినట్లుగా ఏపీ రైతులు వ్యవహరిస్తున్నారు. సౌదీ, దుబాయ్ వంటి దేశాలకు అరటి ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంటుదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

సబ్సిడీలు దక్కడం లేదు..

అరటి సాగు చేసే వారిలో సాధారణ రైతాంగం ఎక్కువగా ఉంటున్నారు. అయితే ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలు, వివిధ పథకాలు, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలకు, ఇతర ఎగుమతిదారులకు ఉపయోగపడుతున్నాయి తప్ప సామాన్య రైతులకు పెద్దగా ప్రయోజనం దక్కడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. అరటి పంట వాతావరణ మార్పుల మీద ఆధారపడి ఉంటుందని, గాలుల తీవ్రత ఎక్కువైతే పంట మీద ఆశలు వదులుకోవాల్సిందే అంటున్నారు. పంట కాపాడుకోవడానికి కట్టెల సాయంతో మొక్కను నిలబెట్టుకోవాల్సి వస్తుందని, కానీ కష్టపడి పండించిన తర్వాత ధరలు గిట్టుబాటు కావడం లేదని ప్రభుత్వమే పంట కొనుగోలు చేసి ఎగుమతి చేస్తే ఉపయోగంగా ఉంటుదని, సబ్సిడీలు ఇచ్చి, పంటకి మార్కెట్ కల్పిస్తే అరటి రైతుకి ధోకా ఉండదని అని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పెరుగుతోన్న అరటి పంట విస్తీర్ణం..

ఎగుమతులతో విదేశాల్లో ఆంధ్ర అరటికి డిమాండ్ కనిపిస్తోంది. అయితే సాధారణ రైతుకి మరింత తోడ్పాటు అవసరమనే అభిప్రాయం వినిపిస్తోంది. అది జరిగితే అరటి సాగులో కడప రైతులు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

చేనేతలను ఆదుకుంటాం

చేనేతల సదస్సులో మాట్లాడుతున్న నారా లోకేష్

- 500 కిలోమీటర్లు చేరుకున్న పాదయాత్ర
- ఇరిగేషన్ ప్రాజెక్టులపై శ్రద్ధ లేని ప్రభుత్వం
- టమోటా ప్రాసెసింగ్, కోల్డ్‌స్టోరేజ్‌కు కృషి
- పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చేనేత కార్మికులను జగన్ ప్రభుత్వం మోసం చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వారిని ఆదుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 39వ రోజుకు చేరుకుంది. గురువారం అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గంలోని పూల వాండ్లపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర సిటిఎం-1, సిటిఎం-1 క్రాస్, సిటిఎం-2, కొత్త వారిపల్లె, ఎనుములవారిపల్లె, తురకపల్లి, వెంకటప్పకొండ, తట్టివారిపల్లె దేవతానగర్ వరకూ పాదయాత్ర సాగింది. చిన్నతిప్పసముద్రం-2 వద్దకు పాదయాత్ర 500 కిలోమీటర్లకు చేరుకుంది. గుర్తుగా శిలాఫలకాన్ని లోకేష్ ఆవిష్కరించారు. దేవతానగర్ వద్ద విడిది కేంద్రంలో బస చేశారు. అక్కడే పలువురు టిడిపిలో చేరారు. పాదయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థానికులతో మాటామంతి, చేనేతలతో సమావేశం, మైనార్టీలు, టిడ్కో గృహాల బాధిత లబ్ధిదారులతో భేటీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా బ్రహ్మణ సేవా సంఘం, బోయ, వాల్మీకి, పాలేఏకిరి సామాజిక వర్గం ప్రతినిధులు నాయకులు, రైతులు కలిసి తమ సమస్యలు వివరించారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నేతన్నలకు గుర్తింపు కార్డులు అందజేసిన ఘనత టిడిపిదేనన్నారు. జగన్ పాలన వచ్చిన తరువాత కనీసం చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చే దిక్కు లేదన్నారు. పవర్ లూమ్ వస్త్రాలు, చేనేత వస్త్రాలకు తేడా తెలిసేలా లేబిలింగ్ చేయాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందని తెలిపారు. అప్పుడే నేతన్న కష్టానికి తగిన ఫలితం వస్తుందని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేతకు ఒక ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ చేసి మార్కెట్ లింకేజ్ ద్వారా అధిక ఆదాయం వచ్చేలా చేస్తామని పేర్కొన్నారు. 60 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే ఒక్క కుటుంబానికి కూడా న్యాయం జరగలేదని తెలిపారు. ఆప్కో ద్వారా చేనేత వస్త్రాల కొనుగోలు జరగడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బీమా, వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు భారీగా నిధులు కేటాయించడమేగాక పేద బ్రాహ్మణులకు అండగా ఉండటానికి అనేక పథకాలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. జగన్ అధికా రంలో వచ్చాక అన్నింటినీ రద్దుచేస్తూ రద్దుల ముఖ్య మంత్రిగా పేరుతెచ్చుకున్నారని తెలిపారు. పేద బ్రాహ్మణుల సమస్యలపై అవగాహన ఉందని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వాల్మీకి, బోయలకు రాజకీయంగా పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీనేనన్నారు. జగన్ బిసి కులాల వారందరినీ మోసగించాడన్నారు. వాల్మీకి/బోయలకు న్యాయం చేస్తామనీ, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు. వైసిపి ప్రభుతం కులానికొక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కనీసం కుర్చీ కూడా ఇవ్వకుండా బిసిలను తీవ్రంగా అవమానిస్తున్నారు. రాయలసీమలో అధికంగా ఉన్న పాలఏకిరి విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్ సౌకర్యం కల్పించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్న పాలఏకిరిలకు చిరువ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు రుణాలు ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. జగన్ దోచుకోవడం దాచుకోవడంపై ఉన్న శ్రద్ధ రాయలసీమలో ప్రాజెక్టులపై లేదన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల కోసం టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.13 వేల కోట్లు ఖర్చుచేస్తే, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం రూ.వెయ్యి కోట్లు మాత్రమే ఖర్చుచేసిందని గుర్తుచేశారు. హంద్రీ-నీవాకు సంబంధించి గత ప్రభుత్వంలో 80 శాతం పనులు పూర్తిచేయగా, మిగిలిన 20 శాతం పూర్తిచేయడం ఈ చేతగాని సిఎం వల్లకాలేదన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీ-నీవా పనులు పూర్తిచేస్తామని తెలిపారు.

రాములోరి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- పోస్టర్ ఆవిష్కరణలో టిటిడి ఇఒ ధర్మారెడ్డి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న టిటిడి ఇఒ, కడప కలెక్టర్

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

టిటిడిలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టి కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి అధికారులను కోరారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్‌పి అన్బురాజన్, జిల్లా యంత్రాంగంతో గురువారం ఒంటిమిట్టలో ఇఒ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుని శ్రీ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. టిటిడి, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 16వ తేదీ మరోసారి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ నెల 30వ తేదీ శ్రీరామనవమితో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 3వ తేదీ హనుమంత వాహనం, ఏప్రిల్ 4వ తేదీ గరుడవాహనం, ఏప్రిల్ 5వ తేదీ సీతారాముల కల్యాణాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఏప్రిల్ 6న రథోత్సవం, ఏప్రిల్ 8న చక్రస్నానం, ఏప్రిల్ 9న పుష్పయాగము జరుగుతాయని చెప్పారు. వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్టీసీ బస్సులు, హెల్ప్ డెస్కులు, సైన్ బోర్డులు, పారిశుధ్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టం విభాగాలు ఈ నెల 16వ తేదీలోపు తమ కార్యాచరణ ప్రణాళికలను అందించాలన్నారు. అంతకుముందు టిటిడి ఇఒ, వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌తో కలిసి శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, వైఎస్ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయి కాంత్‌వర్మ, డిఆర్ఒ గంగాధర్, ఎస్‌విబిసి సిఇఒ షణ్ముఖ కుమార్, టిటిడి సిఇ నాగేశ్వరరావు, కడప ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి, ఒఎస్‌డి రఘునాథ్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు యదుభూషన్‌రెడ్డి, ఆనంద్ నాయక్, డిఎస్‌పి శివారెడ్డి, వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఎపిసి ప్రభాకర్‌రెడ్డి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు, సిపిఒ వెంకటరావు, డిపిఒ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సిఇఒ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఇ మునిశంకరయ్య, డిటిసి మీరాప్రసాద్, ఆర్టీసీ ఆర్‌ఎం ప్రసాద్ రెడ్డి, టిటిడి పిఆర్‌ఒ రవి, సమాచార శాఖ ఎడి వేణుగోపాల్‌రెడ్డి, ప్రత్యేక ప్రతిభావంతుల శాఖ ఎడి కృష్ణకిషోర్, ఎపిఎంఐపి పీడీ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

బద్వేలు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు రావలసిన బకాయిలు, రెండు డిఎలను వెంటనే విడుదలకు చర్యలు తీసుకోవాలని పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ మీనాక్షిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బద్వేల్ రెవిన్యూ డివిజన్ అధికారి, తహశీల్దార్, ఖజానా శాఖ అధికారికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్య క్షులు డాక్టర్ డి.మీనాక్షిరెడ్డి మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటి తేదీన పెన్షన్ విధంగా చర్యలు తీసుకోవాలని రెండు డిఎల విడు దలకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కార్య క్రమంలో బద్వేల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, అసోసియేట్ ప్రెసిడెంట్ గంజికుంట పుల్లయ్య, గౌరవ సలహాలు గడి పుల్లంరాజు, ఆర్గనైజింగ్ కార్య దర్శి పిచ్చయ్య, ఉపాధ్యక్షులు ఆనందరావు, ప్రసాద్, రామసుబ్బారెడ్డి, యల్లారెడ్డి, చిన్న, రాయుడు, సుబ్బరాయుడు, మహబూబాషా పాల్గొన్నారు.

వసతుల బాధ్యత తహశీల్దార్లదే : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ స్టేషన్లలో వసతుల బాధ్యత ఆయా మండలాల తహశీల్దార్లదేనని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కాలెక్టరేట్‌లోని విసి హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై జెసి సిఎం సాయికాంత్ వర్మతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులు, ఆర్డీవోలు, సెక్టోరల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, అన్ని మండలాల తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో భాగంగా పోలింగ్ స్టేషన్ల వద్ద వసతులు, కనీస, మౌలిక సదుపాయాల కల్పన, పోలింగ్ సిబ్బంది, పోలింగ్ మెటీరియల్ రవాణా, బ్యాలెట్ పేపర్ల భద్రత ఏర్పాట్లు తదితర అంశాలపై తహశీల్దార్లకు జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో జరిగిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ఈ నెల 13వ తేదీన జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలను విజవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం సంసిద్ధం చేసుకోవాలన్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల విధులను చేపట్టాయాలన్నారు. పోలింగ్ మెటీరియల్ జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై అదనపు భద్రతా సిబ్బంది ఏర్పాటుతో పాటు.. ప్రత్యేక ద ృష్టి సారించాలన్నారు. వెబ్ కాస్టింగ్ నిర్వహణ, పోలింగ్ మెటీరియల్ రవాణా కోసం ఎంపిక చేసిన రూట్ల భద్రతా చర్యలను పటిష్టం చేయాలన్నారు.

ఉద్యమ అభ్యర్థులను చట్టసభలకు పంపుదాం : డివైఎఫ్ఐ

బద్వేలు : ప్రజల పక్షాన పోరాడే ఉద్యమ నేపథ్యం కలిగిన అభ్యర్థులను చట్టసభలకు పంపుదామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు. గురువారం పలు విద్యా సంస్థల్లో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ నిరుద్యోగ యువతి యువకుల కోసం, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరేషన్ సమస్యలను ప్రభుత్వంతో పోరాడి సాధించగలిగే అభ్యర్థులను మనమందరం గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ 198కి పైగా ఉద్యోగ ఉపాధ్యాయ ప్రజా సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న మన ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును ఈ ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, పట్టణ నాయకులు రమణారెడ్డి, మల్లికార్జున, ఇమ్మానుయేలు, వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు పొంగూరు నాగరాజు, సిఐటియు నాయకులు ఓబులేసు పాల్గొన్నారు. **కాశినాయన :** పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రచారం నిర్వహించింది. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ పోటీని తట్టుకునేలా శ్రమిద్దాం

వైవీయూ 17వ వ్యవస్థాపక, కళాశాల దినోత్సవంలో విసి రంగ జనార్ధన్

సమావేశంలో మాట్లాడుతున్న విసి రంగ జనార్ధన్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉన్నత విద్యలో వచ్చే విప్లవాత్మక మార్పులకు తట్టుకొని ప్రపంచ పోటీలో నిలబడేలా విద్యార్థులు అధ్యాపకులు శ్రమించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య రంగ జనార్ధన ఉద్బోధించారు. వైవీయూ 17వ వ్యవస్థాపక, కళాశాల వేడుకల వేదిక డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో మంచి వాతావరణం వనరులు ఉన్నాయి. ప్రణాళికలు అమలు చేసుకుని విద్యార్థులు అత్యున్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి అధ్యాపకుడు తాను ఎదుగుతూ విశ్వవిద్యాలయాన్ని ప్రపంచంలో నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు ప్రయత్నించాలన్నారు. నాణ్యమైన పరిశోధన, బోధన, పరిపాలన వైవీయూలు లభిస్తోందని త్వరలోనే దేశంలోనే నెంబర్ వన్ విశ్వవిద్యాలయం గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ విద్యాలయాలు ప్రారంభం కాబోతున్నాయి. ఆకర్షణీయమైన పాఠ్యాలు విద్యార్థులకు అందుబాటులోకి వస్తున్నాయి. విదేశీ విద్యాలయాలు వస్తున్నాయి భవిష్యత్ పోటీని తట్టుకునేలా అధ్యాపకులు తయారు కావాలన్నారు. 17 ఏళ్లు పూర్తి చేసుకుని మైనర్ నుండి మేజర్‌కి వెళ్తున్న యోగి వేమన విశ్వవిద్యాలయం అత్యంత శక్తివంతమైన సంస్థగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆన్లైన్, ఆఫ్ లైన్, బ్లండెడ్ మోడ్ విధానాల్లో పాఠాలు బోధించాలని జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు రెట్టింపు చేసుకోవాలని సూచించారు. దూర విద్యా విధానం లో ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చామని దీన్ని ఎక్కువ శాతం మంది వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. స్పేస్ డిపార్ట్‌మెంట్ నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ లాబొరేటరీ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్ర మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ పోటీని తట్టుకునేలా జ్ఞాన సమపార్ధన చేయాలన్నారు. దేశంలోని ప్రఖ్యాత విద్యాసంస్థల్లో ఐఐటి, ఎన్ఐటి చదివే వారిలో తెలుగు విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నారని, సైన్స్ పట్ల విద్యార్థులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఫెలోషిపులు ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వై.పి.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు అత్యున్నత ఆశయంతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపల్ ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020 అమలులో వైవియు అన్ని విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. 39 మంది విద్యార్థులకు పీహెచ్డీలు అవార్డు చేయడంతో పాటు, ఎక్స్ట్రా మ్యూ రల్ రీసెర్చ్ (ఈఎమ్ఆర్) ద్వారా 23 మందికి పరిశోధనకు అవకాశం కల్పించామన్నారు. ముగ్గుల అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, వివిధ సంస్థల నుంచి మరికొంతమంది అధ్యాపకులకు అత్యున్నత అవార్డులు లభించాయని తెలిపారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి, యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు సుబ్బారెడ్డి, ఎ.హరినారాయణ, వ్యాయామ విద్యా సంచాలకులు డాక్టర్ ఎ.రామసుబ్బారెడ్డి డీన్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం సాంస్కృతిక విభాగ సమన్వయకర్త ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి, థియేటర్ ఆర్ట్స్ ఆచార్యులు మూల మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా క్రీడా దినోత్సవ వేడుకలు

బహుమతులు పొందిన విద్యార్థులతో యాజమాన్యం

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్లో స్పోర్ట్స్ బజ్-2023 పేరిట క్రీడాదినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్టెప్ సిఇఒ సి.సాయి గ్రేస్ హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని నాగార్జున విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీదేవి, క్రీడా పతాకాన్ని సాయి గ్రేస్ ఆవిష్కరించారు. అనంతరం క్రీడల్లో పాల్గొన్న పిల్లలచే ముఖ్య అతిథి గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల పిల్లలకు మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, జవాబుదారీతనం వంటి లక్షణాలు అలవడతాయని పేర్కొన్నారు. జీవితంలో కూడా పోటీతత్వం ఏర్పడుతుందని తెలిపారు. సాయి గ్రేస్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలని పేర్కొన్నారు. శారీరక దృఢత్వం ఉంటేనే ఏమైన సాధించగలమన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీదేవి, నాగార్జున మోడల్ స్కూల్ డీన్ కులాయప్ప పాల్గొన్నారు.

8 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

కడపలోని ఎసిఎ స్టేడియంలో గురువారం ప్రారంభమైన పి.ధనుంజయ్‌రెడ్డి వెటరన్స్ టి-20 మెమోరియల్ టోర్నమెంట్లో నెల్లూరు జట్టుపై 8 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 20 ఓవర్లలో 158/5 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎం రాజాకృష్ణ 79 పరుగులు చేశారు. అనంతరం 159 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్కు దిగిన అనంతపురం జట్టు 17.5 ఓవర్లలో 161/2 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని షాబుద్దీన్ 56, ప్రదీప్ 41 పరుగులు చేశారు.

కడపపై హైదరాబాద్ జట్టు విజయం

మరో మ్యాచ్‌లో కడప జట్టుపై ఏడు వికెట్ల తేడాతో హైదరాబాద్ జట్టు ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు 18.1 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని శ్రీకాంత్‌రెడ్డి 38, ఖదీర్ బాబా 24 పరుగులు చేశారు. అనంతరం 105 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్కు దిగిన హైదరాబాద్ జట్టు 14.4 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని టి.చంద్రశేఖర్ 43, రజినీకాంత్ 29 పరుగులు చేశారు. కడప జట్టులోని సంజయ్ కుమార్ రెడ్డి, ఖదీర్ బాబా ఒక్కో వికెట్ తీసుకున్నారు.

విద్యా సామగ్రి అందజేస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి పదవ తరగతి విద్యార్థులకు గురువారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. 91మందికి పరీక్ష రాసేందుకు అవసరమైన స్టేషనరి అందజేశారు. తన చెల్లెలు సువర్ణ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఈ నెల 13న జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ఆదేశించారు. నగర పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న పోలింగ్‌స్టేషన్‌లను గురువారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌లలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఓటర్లకు ఎలాంటి అంతరాయం కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్, శానిటరి ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, శానిటరి సెక్రటరీలు శ్రీదేవి, చంద్రావతి, ప్రధానోపాధ్యాయులు బాబు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఆయన సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, వెల్ఫేర్ సెక్రెటరీలతో జగనన్న సంపూర్ణ భూ హక్కు, భూ రక్ష పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయం సెక్రెటరీలు సమన్వయంతో పనిచేసి పథక విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఆస్తి పన్ను వసూలు సచివాలయం పరంగా వందశాతం అయ్యేందుకు శ్రమించాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లకు లబ్ధిదారులు కట్టవలసిన మొత్తాలను చెల్లించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, మునిసిపల్ ఆర్ఐ రఘునాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ నరసింహారెడ్డి

పసుపు రైతుల గోడు పట్టని ప్రభుత్వం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

పసుపు రైతుల గోడు వైసిపి ప్రభుత్వానికి పట్టడం లేదని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పసుపు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పసుపు సాగు చేసిన రైతులకు పంట చేతికి వచ్చినా కొనే వారు ముందుకు రావడం లేదన్నారు. కనీస మద్దతు ధర క్వింటా రూ.6,850గా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ప్రయివేటు వ్యాపారులు క్వింటా రూ,4500కే కొంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మార్కెట్ యార్డు, రైతు భరోసా కేంద్రాల ద్వారా క్వింటా పసుపు రూ.6,850 కొనుగోలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం ఆనారోగ్యంగా మారిందని విమర్శించారు. పేదలకు ఉచితంగా, మెరుగైన, కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభించిందని చెప్పారు. జగన్ పాలనలో మాత్రం లక్ష్యం నెరవేరడం లేదన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల విషయంలో సిఎం జగన్ మాట తప్పారన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

బ్రెడ్ పంపిణీ చేస్తున్న వైద్యులు లక్ష్మీ ప్రియ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మానవతా సేవా సంస్థ సభ్యుడు, విశ్రాంత అధ్యాపకుడు గోపాల్‌రెడ్డి మనవళ్లు రిషినందన్‌రెడ్డి, సాత్విక్‌రెడ్డి జన్మదిన సందర్భంగా గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వైద్యురాలు లక్ష్మీప్రియ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మానవతా చైర్మన్ కొం డారెడ్డి, ట్రెజరర్ హరిశ్చంద్రారెడ్డి, డైరెక్టర్లు సదాశివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అశ్వర్థ నారాయణరెడ్డి, శివరామిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, రంగారెడ్డి పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్స్

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పులివెందుల పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఆ మేరకు గురువారం వారు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలికాలంలో పెన్షన్ చెల్లింపులో తీవ్రజాప్యం జరుగుతున్నందున తీవ్ర మానసిక వత్తిడికి గురవుతున్నామన్నారు. ప్రతినెల ఒకటవ తేదీన పెన్షన్ జమ చేసేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, డివి కొండారెడ్డి, నారాయణరెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, రంగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్లు

- బోరు నీరు తాగుతున్న విద్యార్థులు.. పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు

నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి కేంద్రం

బోరు నీరు తాగుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు మొదటి విడతలో భాగంగా ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాలు ఏవీ కూడా పనిచేయడంలేదు. పట్టణ పరిధిలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని పోట్లదుర్తి, చిలమకూరు ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసింది. మండల పరిధిలో మొత్తం నాలుగు పాఠశాలల్లో 2020-21 వార్షిక సంవత్సరంలో నాడు-నేడు మొదటి విడతలో భాగంగా ప్రభుత్వం కేటాయించింది. ఈ నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం 'ఆహ్లాద' అనే కంపెనీకి అప్పచెబుతూ.. మూడు నుండి ఐదు సంవత్సరాల వరకు వాటి నిర్వహణ బాధ్యతలు కూడా అప్పజెప్పారు. అయితే వాటిని ఏర్పాటు చేసినప్పటి నుండి ఏవో ఒక సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఆహ్లాద అనే కంపెనీ నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణ బాధ్యతలను స్థానికంగా కడపలో ఉన్న 'సత్యం ఏజెన్సీ' అనే సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ ప్రతినిధులకు సమస్యల గురించి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ఒక్కో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.4 లక్షల 75 వేలు ప్రభుత్వం వెచ్చించినా, వాటి నిర్వహణ లేకపోవడం వల్ల ఉపయోగించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు బోరు నీరు తాగాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు ఇలాంటి సమస్యలపై దృష్టి సారించకపోగా, భవనాల ప్రారంభోత్సవాలకు, ప్రభుత్వం అందిస్తున్న ట్యాబుల ప్రదానం చేయు కార్యక్రమాలకు హాజరవుతు న్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి దండ్రులు కోరు తున్నారు.

నిర్వహణ సంస్థ పట్టించుకోవడం లేదు

నీటి శుద్ధి కేంద్రంలో సమస్యలు తలెత్తి దాదాపు 6 మాసాలు అవుతున్నా, దాని నిర్వహణ సంస్థ పట్టించుకోవడం లేదు. పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదు. ఈ కారణంగా విద్యార్థులు బోరునీరు తాగే పరిస్థితి ఏర్పడింది.

- అరుణకిరణ్, ప్రధానోపాధ్యాయురాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పోట్లదుర్తి

మోటర్లు పంపడం లేదు

మండలంలో ఉన్న అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది. ఇప్పుడున్న మోటార్లకు అంత సామర్థ్యం లేక పనిచేయడం లేదు. వాటి స్థానంలో హై ప్రెజర్ పంపులు కావాలని కంపెనీని అడిగినా ఇంతవరకు పంపలేదు. చిన్న చిన్న సమస్యలు తలెత్తినప్పుడు ఫిర్యాదు రాగానే వెళుతున్నాం.

- రమేష్, నిర్వహణ సంస్థ ప్రతినిధి, సత్యం ఏజెన్సీస్, కడప.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సబ్ జూనియర్ త్రోబాల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా అసోసియేషన్ తరపున ఈ నెల 8న నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ బాలుర విభాగంలో బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థల్లో 9వ తరగతి చదువుతున్న సి.గంగిరెడ్డి, ఎ.దినకర్‌రెడ్డి, పి. సందీప్‌రెడ్డి, జి.సుమంత్‌రెడ్డి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు ఈ నెల 28 నుండి 30వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాయిలో జరిగే 30వ జాతీయస్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ పోటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొనబోతున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టర్ బీరం స్వాతి శ్రీకాంత్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన పిఇటి సురేష్‌ను యాజమాన్యం అభినందించింది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి


ఖాజీపేట : రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

ప్రజాశక్తి - ఖాజీపేట

హైరిస్క్ (ప్రమాద స్థాయి) గర్భిణులను గుర్తించి, వారు ప్రభుత్వాసుపత్రితో ప్రసవం అయ్యేలా చూడాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. డాక్టర్ ముబీన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన వైద్యులు, సిబ్బంది, గర్భిణులకు పలు సూచనలు చేశారు. టీకా, కాన్పుల, సూదులు వేసే, వాక్సిన్ నిల్వ చేసే గదులను పరిశీలించి సలహాలిచ్చారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, ఆశా నోడల్ పర్సన్ అరుణకుమారి, సూపర్‌వైజర్స్ సునీల్‌కుమార్, కృష్ణప్రియ, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : రక్తహీనత లేకుండా చూసుకోవాలని వైద్యాధికారి రాజేష్‌కుమార్ గర్భిణులకు సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో గురువారం గైనకాలజిస్ట్ సుమిత్ర గర్భిణులను పరీక్షించారు. రక్తహీనత నివారణకు పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. పిహెచ్‌సిలో మహిళా వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ప్రసవానికి ఇక్కడికి రావాలని తెలి పారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు హెల్త్ సూపర్వైజర్ సరస్వతి భోజన వసతి కల్పించారు. సిహెచ్ఒ రాముడు, క్లస్టర్ పర్య వేక్షకులు భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, ఎఎన్ ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వేంపల్లె : ప్రతి నెల గర్భిణులు టీకాలు వేయించుకుని, జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ నిజాముద్దీన్ సూచించారు. తాళ్లపల్లె పిహెచ్‌సిలో గర్భిణులకు పరీక్షలు చేసి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫిఉన్నిషా బేగం, సిహెచ్ఒ వెంకటరత్నం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొండాపురం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులను డాక్టర్ వి.సుజాత పరీక్షించారు. అనంతరం వారికి ఆహార సమతుల్యత గురించి వివరించారు. ఆకుకూరలు, పాలు, పండ్లు, పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టరు సూచించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ కళావతి, సూపర్వైజర్ రాము, సిహెచ్ఒలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతుల కొరత

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు మండల శివారులో ఒక ఊరు తయారవుతోంది. అయితే ఆ ఊరిలో కొత్త ఇళ్ల నిర్మాణానికి నీరు, విద్యుత్ సదుపాయాల్లేవు. కనీసం మట్టి రోడ్డు కూడా లేదు. ఆ ఊరేదంటారా.. జగనన్న కాలనీ. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో 2,316 మంది ఇళ్ల లేని నిరుపేదలకు అంబవరం సమీపంలో ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాల పట్టాలిచ్చారు. ఇల్లు కట్టుకోవాలంటూ వాలంటీర్లు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఓ వైపు అవగాహన, మరో వైపు వత్తిడి కల్పిస్తున్నారని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. వారి వత్తిడితో ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా చేస్తున్నాం కానీ.. సిమెంట్ గోడలను, కాంక్రెట్ వేసిన పై కప్పు క్యూరింగ్ చేయాలంటే నీటి సౌకర్యం లేదు. వారంలో మూడు రోజులు వస్తాయి. శనివారం వచ్చిందంటే సోమవారం మధ్యాహ్నం నీరు వచ్చే వరకు పనులన్నీ ఆపాల్సిందే. ఈ సమయంలో కట్టుకున్న ఇళ్లకు నీరు లేక ఎండిపోయి నెర్రలు చీలుతాయని భయమేస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అందులో బేస్ మట్టం కింది వరకు (భూమి లెవెల్‌కు) పూర్తి చేసిన వారు 330 మంది ఉన్నారు. బేస్‌మట్టం లెవల్ వరకు 1,502 మంది పూర్తి చేశారు. రూఫ్ లెవల్ 296, ఆర్‌సి లెవల్ వరకు 116, మరో 71 మంది ఇళ్లను పూర్తిగా నిర్మించుకున్నారు. అయితే ఈ నిర్మాణ పనులకు కావలసిన వాటిని తీసుకొచ్చేందుకు రోడ్డు సక్రమంగా లేదు. ఉన్న మట్టి రోడ్డు గుంతలతో, రాళ్లతో దర్శనమిస్తోంది. నీరు లేకపోవడంతో రూ.1200 నీళ్ల ట్యాంకర్‌కు బాడుగ ఇచ్చి తెచ్చుకుంటున్నారు. ఓ వైపు బాడుగ ఖర్చులు పెరుగుతాయి. మరో వైపు నిర్మించకుంటే వత్తిడి తెస్తున్నారు. వారిచ్చే డబ్బు సరిపోవడం లేదు. అన్నిరకాలుగా ఇబ్బంది పడుతున్నామని బాధితులు ఆందోళన చెందుతున్నారు. తెల్లవారు జామున నీళ్ల పట్టుకోవాలని అధికారులు చెబుతున్నారు. కానీ చీకటిలో ఎలా పట్టుకోవాలో భయంగా ఉందని పేర్కొంటున్నారు. కరెంట్ సమస్య వేధిస్తోందన్నారు. అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బాడుగ వాటర్ ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న లబ్ధిదారులు

కనీస వసతులు కల్పించాలి

ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఆ మేరకు కనీసం వసతులు కూడా కల్పిస్తే బాగుంటుంది. ఇల్లు పూర్తి చేయాలంటే సరిపడా నీళు లేవు, బాడుగకు ట్యాంకర్లను తీసుకొచ్చి పట్టుకుంటున్నాం. కరెంటు సమస్య వేధిస్తోంది. ముబ్బుల్లో పురుగు, పుట్ట ఉంటాయని భయపడుతున్నాం. సమస్యలన్నింటిని పరిష్కరించాలని అధికారులను వేడుకుంటున్నాం.

- టి.వి. రమేష్ లబ్ధిదారుడు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

నీటిని వృథా చేస్తే భావితరాలకు నష్టం

ప్రజాశక్తి - వేంపల్లె

నీటిని వృథా చేయడం వల్ల భావితరాలకు నష్టం జరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం సహకారంతో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'వర్షపు నీటిని ఒడిసి పట్టుట' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటిని నీటి కుంటల ద్వారా కాపాడడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ మణికంఠ మాట్లాడుతూ ఇంటి సమీపంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. నీటిని వృథా చేయరాదన్నారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, డాక్టర్ మల్లేశ్వరమ్మ, కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆల్‌షిఫా'లో అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఆల్‌షిఫా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న మానసిక విభిన్నప్రతిభావంతులకు బి.చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీలక్ష్మి కుమార్తె హన్విక పుట్టినరోజు సందర్భంగా గురువారం విందు భోజనం ఏర్పాటు చేశారు. పిల్లలందరిని ఆశీర్వదించి స్వీట్స్, కేకులు పంపిణీ చేశారు. అనంతరం బి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నాయకుల ఆశీర్వాదంతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు.

క్రైం కార్నర్

భూ తగాదాలో ఘర్షణ : పలువురికి గాయాలు

- 11 మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని జి.నరసింహాపురం పొలంలో గురువారం భూ సమస్యతో ఘర్షణ జరిగింది. వైసిపి నాయకులపై కారంపొడి చల్లి, కర్రలతో దాడి చేశారు. చౌదరివారిపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 340లో 1.93సెంట్లు బత్తల సిద్దయ్య అనే వ్యక్తి పొలం ఉంది. ఆ పక్కనే సర్వే నెంబర్ 281లో బేరి అచ్చమ్మ అనే పేరు మీద 2.81విస్తీర్ణంలో భూమి ఉండేది. బేరి అచ్చమ్మ పొలం సాగులో లేకపోవడంతో బత్తల సిద్దయ్య తమ పొలం కాకుండా 1.56 విస్తీర్ణాన్ని అదనంగా సాగు చేసుకోవడం జరిగింది. ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేలో బేరి అచ్చమ్మ పొలం హద్దులు కేటాయించారు. అప్పటి నుండి ఈ భూ సమస్య మొదలైంది. బత్తుల సిద్దయ్య పొలం నాది అంటూ అడ్డు తిరగడంతో చుట్టుపక్కల గ్రామాల పెద్ద మనుషులు పంచాయతీ చేసి ఇరువురికి చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం బేరి అచ్చమ్మ కుటుంబ సభ్యులు తమ పొలం చుట్టూ కంచె ఏర్పాటు చేసుకునేందుకు వెళ్లారు. బత్తల సిద్దయ్య కుటుంబీకులు బేరి అచ్చమ్మ కుటుంబీకులను కారంపొడి, రాళ్లు, కర్రలతో నడిరోడ్డుపై విచక్షణ రహితంగా దాడి చేశారు. పెద్ద మనుషులుగా వెళ్లిన వైసిపి నాయకులను సైతం కళ్ళల్లో కారం చల్లి కొట్టారు. గాయపడిన వైసిపి నాయకుల కుటుంబ సభ్యులు గొడవకు దిగిన వారి ఇళ్లపై దాడులు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ విద్యాసాగర్, మైదుకూరు రూరల్ సిఐ నరేందర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని గొడవ జరిగిన తీరుపై ఆరా తీశారు. విచారణ చేసి గొడవకు పాల్పడిన 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి, కడప రిమ్స్‌కు తరలించారు.

గొడవపడుతున్న రెండు గ్రూపులకు చెందిన వారు

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No : 124/2020
G.@.O.రాజేశ్వరమ్మ, W/o O.V. రామసుబ్బారెడ్డి, హిందూ, ఎన్జీఓ కాలనీ, నంద్యాల టౌన్, కర్నూలు జిల్లా.
...వాది
Vs
6. గోనా వకులదేవి, W/o సాయిరమేష్ రెడ్డి, హిందూ, 40సం॥లు.
9. కాకనూరు సంజీవరెడ్డి, S/o తెలియదు, 60సం॥లు.
10. పూల వెంకటరెడ్డి, S/o తెలియదు.
11. గోనా గంగా ప్రసాద్‌రెడ్డి.
అందరూ టంగుటూరు గ్రా॥, రాజుపాలెం మం॥,కడప జిల్లా.
...6, 9, 10, 11 ప్రతివాదులు.
దావా సమను మరియు నోటీసు
పై నెంబరు దావాను వాది, మీ పైనను మరియు మరికొంత వాది పై బాగ పరిష్కారం కోరి దావాను దాఖలు చేస్తూ, అట్టి ఆస్థిని క్రయ, విక్రయాలు జరుపకుండా ఉండుటకు గాను ఇంజక్షన్ ఆర్డరు కోరి I.A.No.301/2020 నెంబర్ పిటిసన్‌ను దాఖలు చేయగా ప్రస్తుతం పెండింగ్‌లో వుంటున్నది. పై నెంబరు దావాలో మరియు ఇంజక్షన్ పిటిషన్‌లో మీరు హాజరగటుకు గాను 21/4/2023వ తేదీన వాయిదా వుంటున్నది. సబదరు వాయిదా నాడు ఉదయం 10.30 ని॥ ఖుద్దునగానీ, వకీలు గారి ద్వారా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
వాయిదా తేది: 21/4/2023
//By Order of the Court//
జి.శ్రీనివాసులు
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
O.S. No : 521/2020
పాతకోట రామమునిరెడ్డి, S/o తిమ్మారెడ్డి, 64 సం॥లు, డోర్‌నెం.4/121, దొరసానిపల్లె, ప్రొద్దుటూరు.
...వాదులు
Vs
యెన్నం రామమోహన్‌రెడ్డి, S/o వెంకటరామిరెడ్డి, హిందూ 48 సం॥లు, కొర్రపాడు గ్రామం, రాజుపాళెం మం॥.
...ప్రతివాది.
సమను
పై నెంబరు దావాను వాది దావా మొత్తం వగైరాలు రాకోరి ప్రతివాది అయిన నీ పైన దాఖలు చేసివున్నారు. అట్టి దావా యందు నీకు ఏవైనా ఆక్షేపణలు వున్న యెడల 13/4/2023వ తేదీన ఉ॥10.30 గం॥లకు స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును అని తెలియచేయడమైనది.
వాయిదా తేది: 13/4/2023
//By Order of the Court//
ఎన్.వి.వరప్రసాద్
అడ్వకేట్
ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
O.S. No : 692/2019
Shaik Mahammad Rafi, S/o Mahaboob Ali Muslim, age 57 years, D.No.8/129, Almaspet, Main Road, Kadapa.
...Plaintiff
Vs
Shaik Mahammad Rafi, S/o Mahaboob Ali Muslim age 57 years, D.No.8/129, Almaspet Main Road, Kadapa.
...Defendant
సమను
పై నెంబరు దావాను వాది దావా మొత్తం వగైరాలు రాకోరి ప్రతివాది అయిన నీ పైన దాఖలు చేసివున్నాడు. అట్టి దావా యందు ప్రతివాది అయిన నీకు ఏవైన ఆక్షేపణలు వున్నయెడల 20/4/2023వ తేదీన ఉ॥ 10.30 గం॥లకు స్వయంగా కానీ లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
వాయిదా తేది: 20.04.2023
ఎన్.వి.వరప్రసాద్
అడ్వకేట్
ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
O.S. No : 370/2020
ఎ.కిరణ్‌కుమార్, S/o శ్రీనివాసులు, 41సం॥లు, హిందూ, డోర్‌నెం.3/893-13, సరస్వతి విద్యామందిర్ రోడ్డు, ప్రొద్దుటూరు.
...వాది
Vs
ముత్యాలపాటి ఆంజనేయులు, S/o వెంకటరామయ్య, హిందూ, 53 సం॥, వ్యాపారం, డోర్‌నెం.3/91, రైతునగరం, నంద్యాల జిల్లా.
...ప్రతివాది.
సమను
పై నెంబరు దావాను వాది దావా మొత్తం వగైరాలు రాకోరి ప్రతివాది అయిన నీ పైన దాఖలు చేసి వున్నాడు. అట్టి దావా యందు నీకు ఏవైనా ఆక్షేపణలు వున్న యెడల .... 2023వ తేదీన ఉ॥10.30 గం॥లకు స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
వాయిదా తేది: 2023
//By Order of the Court//
జి.వి.భాస్కర్ రెడ్డి
అడ్వకేట్
ప్రొద్దుటూరు.

IN THE COURT OF THE HON'BLE II Addl. JUNIOR CIVIL JUDGE, KADAPA
O.S.No.24 of 2023
Between:
Chinna Pullaiahgari Venkata Ramana Reddy son of Venkata Ramana Reddy, aged 35 years, Hindu,Kapu, business residing at D.No. 15/121, C.Buddayapalli village and post, H/o Chinna Chowk,Kadapa City, Kadapa District.
...Plaintiff
Vs
M.V.Siva Reddy son of M.Chalama Reddy, Hindu, kapu, aged 36 years, cultivation, residing atDoor No.12/356-A, Sreeram Nagar, Chennur village and post, Chennur Mandal, Kadapa District.
...Defendant
The above named plaintiff filed the above suit for realization of 5,85,866/- which was due by you under the suit promissory note. If you have got any objections, appear before the above named Court on 28-03-2023either in person or through your authorized counsel,failing which the matter will be decided as exparte.
//By order of the Court//
M.V. BALI REDDY, B.A.,B.L,
Advocate, H.NO.39.,49-161, Pakkiru palli, Kadapa-516002. Mobile No. 9440118269.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE :: KADAPA
O.S.No. 91/2020
B.Uma.
...Plaintiff/వాది
Vs
Anitha Nagendra, S/o Late A.Subramanyam, aged 43 years, Hindu, Business, Present, R/a.D.No.2/516, Nagarajupet, Kadapa City, YSR District.
...Defendant/ప్రతివాది
NOTICE
వాది మీ పైన పై కోర్టులో బాండు బాపతుకు డిక్రీ ఇవ్వమని దావా వేయగా, మీరు నోటీసులు, సమన్లు తీసుకొనక కాలహరణము చేయుచున్నందున మీరు పై కోర్టులో 13.3.2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న ఎడల తెలుపుకోవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.
//By Court Order//
S.MASTHAN VALLI,
M.Com., L.L.B.,
Advocate & Notary
Kadapa.